www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 16 అక్టోబర్ 2025



చెకుముకి సైన్స్ సంబరాల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-కాశినాయన

జన విజ్ఞాన వేదిక నిర్వహిస్తున్న చెకుముకి సైన్స్ సంబరాలను జయప్రదం చేయాలని ఆ సంస్థ మండల కార్యదర్శి జి.వి.చంద్రశేఖర్ ఆచారి పిలుపునిచ్చారు. బుధవారం నరసాపురం మోడల్ స్కూల్‌లో కళాశాల ప్రిన్సిపల్ సౌజన్య ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ సంబరాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర ఆచారి మాట్లాడుతూ జెవివి ఆధ్వర్యంలో అక్టోబర్ 18న పాఠశాల స్థాయిలో, నవంబర్ 1న మండల స్థాయిలో, నవంబర్ 23న జిల్లా స్థాయిలో పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. 8, 9, 10 తరగతుల విద్యార్థులందరూ ఈ పరీక్షల్లో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యాయ బృందం బాలిరెడ్డి, చంద్ర, జానకి దేవి, సుస్మిత పాల్గొన్నారు.

సాగుకు వేళాయె..విత్తనం రాకపాయే!


- మంజూరైనా పంపిణీ కాని వైనం
- నిన్న యూరియా తిప్పలు.. నేడు పప్పుశనగ విత్తనాల కోసం అవస్థలు
- పప్పుశనగకు రైతుల ఎదురుచూపులు
- రబీ సాగుకు విత్తనం ఇవ్వకుండా సర్కారు దాటవేత



పులివెందుల ప్రాంతంలో సాగుకు సిద్ధం చేసిన పొలం

ప్రజాశక్తి-పులివెందుల టౌన్

నల్లరేగడి భూముల్లో రబీలో సాగయ్యే పప్పుశనగ విత్తుకోవడానికి రైతులు దుక్కులు సిద్ధం చేసుకున్నా...రాయితీ విత్తనాలు పంపిణీ చేయకపోవడంతో ఎదురుచూపులు తప్పడం లేదు. రబీ సీజన్ పంటల సాగుకు మంచి అదును ప్రారంభమైంది. వర్షాలు కూడా సకాలంలో కురుస్తున్నాయి. సరిపడా విత్తనం, ఎరువులు అందించకుండా కూటమి సర్కారు రైతులను ఏడిపిస్తోంది. రబీ సీజన్ మొదలై 15 రోజులు కావస్తున్నా విత్తన పప్పుశనగ ఇవ్వకుండా దాటవేత ధోరణి అవలంబిస్తోంది. ఈ పాటికే విత్తన పంపిణీ పూర్తి చేయాల్సి ఉన్నా ఇప్పటికీ పంపిణీ ప్రక్రియే ప్రారంభించకపోవడం గమనార్హం. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2.45 లక్షలఎకరాల విస్తీర్ణంలో పంట సాగులోకి రావొచ్చని అధికారులు అంచనా వేశారు. రాయితీ విత్తనం ఎప్పుడిస్తారనే విషయం మాత్రం తేల్చడం లేదు. వ్యవసాయ శాఖ, ఎపి సీడ్స్ ఈ విషయంపై నోరు విప్పడం లేదు. పప్పుశనగ రైతులు విత్తనం కోసం ఎదురు చూస్తున్నారు.



నిన్న యూరియా తిప్పలు .. నేడు పప్పుశనగ అవస్థలు

నిన్నటి వరకు యూరియా కోసం తిప్పలు పడుతున్న రైతులు నేడు విత్తనం కోసం అవస్థలు పడాల్సిన దుస్థితి నెలకొంది. బహిరంగ మార్కెట్లో అధిక ధరలు ఉండడంతో పెట్టుబడి పెరిగి సాగు భారమవుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

పంపిణీ ఆలస్యం ఇదే మొదటిసారి

రాయితీ విత్తనం ఇవ్వకుండా జాప్యం చేయడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. రబీ సీజన్ సన్నాహకాలు ఎంత ఆలస్యమైనా అక్టోబర్ 10వ తేదీలోపు పంపిణీ మొదలు పెడతారు. 15 రోజుల క్రితమే కేటాయింపులు, ధరలు ప్రకటించినా పంపిణీ మాత్రం జరగలేదు. రాయితీ కూడా 25 శాతం మాత్రమే. అన్నింటికీ సిద్ధంగా ఉన్నా కూడా విత్తనం ఇవ్వకుండా నాన్చుడి ధోరణి అవలంభిస్తుండటం రైతులకు ఇబ్బందిగా మారింది.

విత్తనాల కేటాయింపు ఇలా..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 37,641 క్వింటాళ్ల పప్పుశనగ విత్తనాలు మంజూరయ్యాయి. నియోజకవర్గవర్గాల వారీగా పులివెందులకు 7900 క్వింటాళ్లు, జమ్మలమడుగుకు 13740, ప్రొద్దుటూరుకు 3900, కమలాపురానికి 8 వేలు, మైదుకూరుకు 310, బద్వేల్‌కు 20 క్వింటాళ్లు కేటాయించారు. బఫర్ స్టాక్ కింద 3771 క్వింటాళ్లు మంజూరయ్యాయి. భూమి పాస్‌బుక్, ఆధార్ కార్డుతో సమీప రైతుసేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వ్యవసాయ అధికారులు తెలిపారు. క్వింటా ధర రూ.7,800 కాగా, ప్రభుత్వం 25 శాతం రాయితీగా రూ.1,950 అందిస్తోంది. రైతులు రూ.5,850 చెల్లించి విత్తనాలు పొందవచ్చున్నారు.

బహిరంగ మార్కెట్లో క్వింటా ధర రూ.6500

బహిరంగ మార్కెట్లో క్వింటా పప్పుశనగ ధర రూ.6500 ఉంది. రాయితీ విత్తనాలు అందకపోతే రైతుకు క్వింటాకు రూ.650 భారం పడనుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే విత్తనాలను పంపిణీ చేయాలని రైతులు కోరుతున్నారు.

పెండింగ్ బకాయిలే.. పంపిణీకి ఆలస్యం

గత సంవత్సరం సరఫరా చేసిన విత్తనాలకు ప్రభుత్వం సప్లయర్స్‌కు బకాయిలు చెల్లించక పెండింగ్‌లో ఉన్నందునే సరఫరా చేయక పంపిణీ ఆలస్యం అవుతోంది. పాత బకాయిలు చెల్లిస్తే సరఫరా చేస్తామని సప్లయర్లు ప్రభుత్వానికి తెలిపారు. ప్రభుత్వం నిధులు విడుదల చేసిన వెంటనే సమస్య పరిష్కారం అవుతుందని, పంపిణీ చేస్తామని వ్యవసాయ అధికారులు తెలుపుతున్నారు.

అదునులోనే విత్తనాలు ఇవ్వాలి

అదును పోయాక విత్తనాలు ఇచ్చినా ప్రయోజనం లేదు. ఒకటి, రెండు రోజుల్లో విత్తనాలు పంపిణీ చేస్తే రైతులకు మేలు జరుగుతుంది. మామూలుగా దీపావళికి మొలక రావాల్సి ఉంది. విత్తనాలు లేక ఆలస్యం అవుతుంది.

- జనార్ధన్‌రెడ్డి, రైతు. పులివెందుల.

గతంలో ఇలా ఎన్నడూ లేదు

గతంలో విత్తనాల పంపిణీ ఆలస్యం లేదు. అక్టోబర్ మొదటి వారంలోనే విత్తనాలను పంపిణీ చేసేవారు. ప్రస్తుతం ఆలస్యం కావడం వల్ల పంట వేయడం లేదు. ఆలస్యం అవుతుండటంతో రైతుకు నష్టం వస్తుంది.

- మదన్‌మోహన్‌రెడ్డి, రైతు, లింగాల.

యాప్ సమస్య ఉంది

యాప్ సమస్య ఉన్నందున బుడ్డశనగ విత్తనాలు పంపిణీ ఆలస్యం అవుతోంది. రెండు రోజుల్లో సమస్య పరిష్కారమవుతుంది. గురువారం ఎప్పుడు పంపిణీ చేయాల అన్నది తెలుస్తుంది. యాప్ పనిచేసిన వెంటనే రైతు భరోసా కేంద్రాలలో రైతుల వివరాలను నమోదు చేసుకుని శశగ విత్తనాలు పంపిణీ చేస్తాం.

- ప్రభాకర్‌రెడ్డి, ఎడిఎ, పులివెందుల.

రైతులకు మేలు చేకూర్చే పరిశోధనలు

- కలెక్టర్ చెరుకూరి శ్రీధర్



జొన్న పంటను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీధర్, జర్మనీ బృందం సభ్యులు

ప్రజాశక్తి- పులివెందుల రూరల్

పులివెందులలోని అంతర్జాతీయ పశు పరిశోధన కేంద్రంలో రైతులకు మేలు చేకూర్చే విధంగా శాస్త్రవేత్తలు పరిశోధనలు చేసి రైతులు లబ్ది పొందే విధంగా వారికి అవగాహన కల్పించాలని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ శాస్త్రవేత్తలకు పిలుపునిచ్చారు. బుధవారం కలెక్టర్ అంతర్జాతీయ పశు పరిశోధన కేంద్రాన్ని శాస్త్రవేత్తలతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారతదేశంలోనే పులివెందులలోనే అంతర్జాతీయ పశు పరిశోధన కేంద్రాన్ని నెలకొల్పారని ఈ కేంద్రం ద్వారా భారతదేశంలో పశు పెంపకాలను ప్రోత్సహించి, పాల ఉత్పత్తిని గణనీయంగా పెంచాలని శాస్త్రవేత్తలకు సూచించారు. ఇప్పటికే అంతర్జాతీయ పశు పరిశోధనలోఇండో జర్మన్ గ్లోబల్ అకాడమీ ఫర్ ఆగ్రో ఎకాలజీ రీసెర్చ్, లెర్నింగ్ ఇనిస్టిట్యూట్ సందర్శించిన జర్మన్ ఫెడరల్ ప్రభుత్వ అంబాసిడర్ డాక్టర్ ఫిలిప్ అకెర్మాన లతోపాటు బెంగు ళూరు కాన్సుల్ జనరల్ అమిత దేశాయ్, కెఎఫ్ డబ్ల్యు బ్యాంకు నుంచి నాచురల్ రిసోర్స్ మేనేజ్మెంట్ స్పెషలిస్ట్ సంగీత అగర్వాల్ కూడా అకాడమీని శాస్త్రవేత్తలతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. అనంతరం పరిశోధన కేంద్రంలో ప్రయోగాత్మకంగా అమలవుతున్న ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించడంతో పాటు అకాడమీలో చేపడుతున్న జాతీయ అంతర్జాతీయ స్థాయి అధ్యయనాలు, అకాడమీ ద్వారా సాధిస్తున్న ఫలితాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఫార్మర్ సైంటిస్, మెంటార్ కోర్స్‌లను అభ్యసిస్తున్న రైతు శాస్త్రవేత్తలు, మెంటార్లు, యంగ్ రీసెర్చ్ ఫెలోస్, ఇంటర్న్‌లతో ముచ్చటించారు. అనంతరం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఇండో జర్మన్ గ్లోబల్ అకాడమీ ఫర్ ఆగ్రో ఎకాలజీ రీసెర్చ్, లెర్నింగ్ ఇనిస్టిట్యూట్ ఐజి కార్లు ద్వారా చేస్తున్న ప్రాజెక్టుల గురించి వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్, అకాడమీ ఎఒ శివారెడ్డి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి చంద్రనాయక్, ఎపిసి ఎన్ఎఫ్ జిల్లా మేనేజర్ ప్రవీణ్ కుమార్, ఆర్‌డిఒ చిన్నయ్య, అధికారులు పాల్గొన్నారు.

భూమిలేని పేదల జాబితాను సిద్ధం చేస్తాం



పేదలతో మాట్లాడుతున్న తహశీల్దార్ వెంకటసుబ్బయ్య

ప్రజాశక్తి-కాశినాయన

మండల పరిధిలోని నాయనపల్లె, ఆకుల నారాయణపల్లె, అక్కింగుండ్ల రెవెన్యూ గ్రామాల పరిధిలోని పేద ప్రజలు భూమికోసం దరఖాస్తులను పరిశీలించి అర్హత కలిగిన వారి జాబితా సిద్ధం చేస్తామని తహశీల్దార్ వెంకటసుబ్బయ్య తెలిపారు. బుధవారం తహశీల్దార్ కార్యాలయం ఎదుట వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మూడు రోజుల నుంచి రిలే నిరాహార దీక్షల్లో సావిశెట్టిపల్లె, కొట్టాల, ఆకులనారాయణపల్లె, నాయనపల్లె, వరికుంట్ల తదితర గ్రామాల భూమిలేని పేద ప్రజలు కూర్చున్నారు. దీక్షా శిబిరాన్ని సందర్శించిన తహశీల్దార్ సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అక్కింగుండ్ల రెవెన్యూ పొలం ప్రత్యేక తహశీల్దారుతో విచారణ త్వరలోనే ఆర్‌డిఒ విచారణ నిర్వహిస్తున్నారని తెలిపారు. ఆకుల నారాయణపల్లె పేదలు సర్వేనెంబర్ 2227 కొండపోరంబోకు భూమిగా ఆర్ఎస్ఆర్‌లో ఉండటంతో ఆర్‌డిఒ ట్రాన్సాక్షన్ చేయాల్సి ఉందన్నారు. ప్రభుత్వం అసైన్‌మెట్ కమిటీ ఏర్పాటు చేసి భూ పంపిణీ ప్రకటించిన వెంటనే అర్హులైన పేదలకు భూమి 1.50 ఎకరాలు చొప్పున పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వ భూమి బినామీ పేర్లతో 30 ఎకరాలు, 50 ఎకరాలు చొప్పున ఆక్రమించుకొని చేస్తున్న వారి పైన తహశీల్దార్ కార్యాలయానికి ఫిర్యాదు చేసిన వెంటనే అటువంటి వారి పైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వ భూమిలో పేదలు సాగు చేస్తున్న భూములకు అడంగల్‌లో నమోదు చేయాలని పేర్కొన్నారు. సాగు పొరాలు ఇవ్వాలన్నారు. తాత్కాలికంగా పట్టాలు అనుదారుల పట్టాలు మంజూరు చేయాలన్నారు. భూ కబ్జాదారులపైన ల్యాండ్ గ్రాబింగ్ కేసులు నమోదు చేయలేదని పేర్కొన్నారు. వెంటనే రాజకీయ పలుకుబడి కలిగిన వారు ప్రభుత్వ భూములను దౌర్జన్యంగా ఆక్రమించుకొని సాగు చేస్తున్న వారందరి పైన కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బి.అన్వేష్, జిల్లా కమిటీ సభ్యులు వెంబడి పోలయ్య, వీరయ్య, మండల అధ్యక్షులు వరికుంట్ల బాబు, రాజశేఖర్, దాస్, కిరణ్, బాలుడు, వీరితోపాటు రిలే దీక్షలో వరికుంట్ల, ఆకుల నారాయణపల్లె, సావిశెట్టిపల్లె, కెఎన్ కొట్టాల, ఇటుకలపాడు, మిద్దెల నాయనపల్లె గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న చంద్ర ఓబుల్‌రెడ్డి

అబ్దుల్ కలాంను స్పూర్తిగా తీసుకోవాలి

- కెఎస్ఆర్ఎం కళాశాల ఎమ్‌డి చంద్రఓబుల్‌రెడ్డి

ప్రజాశక్తి-కడప అర్బన్

మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఎ.పి.జె.అబ్దుల్ కలాంను నేటి విద్యార్థులు ఆదర్శంగా, స్పూర్తిగా తీసుకోవలసిన అవసరం ఉందని కందుల గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కె.చంద్ర ఓబుల్‌రెడ్డి అన్నారు. కెఎల్ఎం మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో 24 గంటల హ్యాకాథాన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అబ్దుల్ కలాం లాంటి మహనీయుడుపుట్టిన రోజును జాతీయ విద్యార్థుల దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. ఆయన జీవితం అందరికీ స్ఫూర్తి అని తెలిపారు. ఆయన కనిపెట్టిన అగ్ని క్షిపణి మన దేశాన్ని శతృదుర్భేద్యం చేసిందని పేర్కొన్నారు. ప్రిన్సిపల్ రత్నమ్మ మాట్లాడుతూ విద్యార్థినులు ఈ చక్కని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉద్యోగ అవకాశాలు మెరుగు పడతాయని తెలిపారు. కరస్పాండెంట్ రాజేశ్వరి విద్యార్థినులకు శుభాకాంక్షలు తెలిపారు. వచ్చే అవకాశాలను అందిపుచ్చుకోవాలని కోరారు. సాయి సతీష్ మాట్లాడుతూ ఒక వస్తువు విలువ, ఉన్న ప్రాంతాన్ని బట్టి మారుతుందని తెలిపారు. ఒక సీసాలో నీళ్ళు ఉన్నపుడు విలువ, దానిలో బంగారు పూత వున్నపుడు ఒక లాగ విలువ మారినట్టే మన మెదడు కూడ్జ్ఞానం ఉన్న మెదడు, లేని మెదడు లాగ ఉంటుందని తెలిపారు. కార్యక్రమం విజయవంతం కావాలని ఆశించారు. కెఎస్ఆర్ఎం కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ట్ నాగేశ్వర్‌ప్రసాద్ విద్యార్థినులకు కలాం ఆదర్శమని, ఆయన గొప్పతనాన్ని శ్లాఘించారు. కార్యక్రమంలో సమన్వయ కర్తలు డాక్టర్ లక్ష్మి నారాయణ, సుధాకర్ మధుప్రియ వందన సమర్పణ చేశారు.

ప్రజల ప్రాణాలతో చెలగాటం వద్దు : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి-కడప అర్బన్

జిల్లాలో ప్రజల ప్రాణాలతో ఆర్ఎంపి వైద్యులు చెలగాటం ఆడుతున్నారని, నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ఆస్పత్రులపై వైద్య ఆరోగ్య శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముడియం చిన్ని, వీరనాల శివకుమార్ తెలిపారు. బుధవారం కడపలో వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో డిప్యూటీ డిఎంహెచ్ఒ ఉమా మహేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని కడప, బద్వేలు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, వేంపల్లి, వెల్లటూరు, పెండ్లిమర్రి, పోరుమామిళ్ళ ప్రాంతాల్లో విచ్చలవిడిగా క్లినిక్ సెంటర్ల ఏర్పాటు అయ్యాయన్నారు. వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు తూతూ మంత్రంగా తనిఖీలు నిర్వహించి వెళుతున్నార న్నారు. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ఆర్ఎంపి క్లినిక్ సెంటర్లపై తనిఖీలు నిర్వహించి నిర్వాహుకులపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి విజయ్ పాల్గొన్నారు.

బిఇఒ కాలేజీలపై చర్యలు తీసుకోవాలి : ఉమ్మడి కడప జిల్లాలో యోగి వేమన విశ్వవిద్యాలయం పరిధిలోని బిఇడి కాలేజీలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్నాయని వాటిపై చర్యలు తీసుకోవడంలో సిడిసి అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముడియం చిన్ని, వీరనాల శివకుమార్ తెలిపారు. వైవీయూ విసి బెల్లంకొండ రాజశేఖర్‌ను కలిసి డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిఇడి కాలేజీల యాజమాన్యాలు విద్యార్థుల వద్ద నుంచి వేల రూపాయలు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. కాలేజీలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, ల్యాబ్‌లు ఉండవన్నారు. కాలేజీలు మాత్రమే ఉంటాయని, వాటిలో ఎవరూ ఉండరని తెలిపారు. యూనివర్సిటీ అధికారులు తూతూ మంత్రంగా పర్యవేక్షణ, తనిఖీలు నిర్వహించి వస్తున్నారని ఎటువంటి చర్య తీసుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో కడప నగర కార్యదర్శి విజయ్ పాల్గొన్నారు.

17న నిరసనలను జయప్రదం చేయండి

- స్ట్రగుల్ కమిటీ రాష్ట్ర చైర్మన్ సుదర్శన్‌రెడ్డి

ప్రజాశక్తి-కడప అర్బన్

విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చేపట్టే నిరసనలు జయప్రదం చేయాలని స్ట్రగుల్డ్ కమిటీ రాష్ట్ర చైర్మన్ సుదర్శన్‌రెడ్డి, సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి, విద్యుత్ యూనియన్ నాయకులు శివశంకర్, నాయబ్ రసూల్ పిలుపునిచ్చారు. బుధవారం విద్యుత్ భవన్ ఎదుట వారు మీడియాతో మాట్లాడారు. కాంట్రాక్టు కార్మికులను సంస్థలో విలీనం చేసుకుని నేరుగా వేతనాలు చెల్లించడానికి ఉన్న అభ్యంతరాలు ఏమిటని ప్రశ్నించారు. జెఎల్ఎం గ్రేడ్-2లకు ఎపిఎస్ఇబి సర్వీస్ రెగ్యులేషన్స్ అమలు చేయడానికి అడ్డంకులేమిటని ప్రశ్నించారు. విద్యుత్ ఉద్యోగులకు పెండింగ్ డిఎలను మంజూరు చేయడములో అలసత్వం వద్దని హితవు పలికారు. ఈ నెల 15న జరగాల్సిన సమ్మె వాయిదా పడిన కారణంగా ఈ నెల 17న మధ్యాహ్నం 3 గంటల నుంచి విద్యుత్ సౌధాలో పవర్ జెఎసితో చర్చలు జరుగుతాయని పేర్కొన్నారు. ప్రభుత్వం హామీలు ఇచ్చారంటున్న సమస్యలపై నిర్దిష్టమైన సమయంలో పరిష్కరిస్తామనే స్పష్టత లేదని తెలిపారు. మొత్తం ఉద్యమంలో కీలకమైన కాంట్రాక్ట్ కార్మికులను సంస్థలో విలీనం చేయాలనే అంశంపై యాజమాన్యం చేతులెత్తేసిందని విమర్శించారు. నేరుగా వేతనాలు చెల్లించడం వల్ల సంవత్సరానికి రూ.192 కోట్లు మిగులుతాయని లెక్క తేల్చిన, యాజమాన్యం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. సంస్థకు నష్టం చేసే నిర్ణయాల వైపే ఎందుకు వెళ్తోంది, వన్ ఇండస్ట్రీ వన్ సర్వీస్, రెగ్యులేషన్స్ ఇంప్లిమెంట్ చేసి జెఎల్ఎం-2లకు న్యాయం చేసేందుకు వచ్చిన ఇబ్బందులు ఏమిటని ప్రశ్నించారు. కార్మికులకు పెన్షన్ ఇవ్వడానికి చట్టాలు అడ్డు వస్తున్నాయని, ఎమ్మెల్యేలకు, ఎంపీలకు ఇవ్వడానికి ఎందుకు అడ్డు రావడం లేదన్నారు. విద్యుత్ సంస్థలో చర్చల పేరుతో, కమిటీల పేరుతో మసి పూసి మారేడు కాయ చేసే పద్ధతులు ఆపాలని డిమాండ్ చేశారు. ఈ నెల 17న చర్చలు జరిగే నేపథ్యంలో రాష్ట్రంలో 27 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు, మరో 30 వేల మంది ఉద్యోగులు ఎంతో ఆతృతతో ఎదురు చూస్తున్నారని తెలిపారు. అందుకే చర్చల్లో మన డిమాండ్స్ సానుకూలంగా పరిష్కారానికై 17న మధ్యాహ్నం 2 గంటలకు అన్ని జిల్లాల్లో ఎస్ఇ ఆఫీసుల ముందు, దూర ప్రాంతాలైతే డిఒ, ఎఇ ఆఫీసుల ముందు ధర్నా, బైటాయింపు వంటి నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. చర్చలకు వెళ్లిన వాళ్లు కాంట్రాక్ట్ కార్మికులకు 2022 పిఆర్‌సి ఎరియర్స్ బకాయిలు, షిఫ్ట్ ఆపరేటర్లందరికీ ఒకే వేతనం, బిల్ కలెక్టర్స్, మీటర్ రీడర్స్, స్టోర్ హమాలీలకు ఉద్యోగ భద్రత, కనీస వేతనం, డిస్కంలను ప్రైవేటీకరణ విధానాలు ఆపడం వంటి అంశాలపైన స్పష్టమైన, రాతపూర్వకమైన ఒప్పందం లేకుండా సమ్మెను, పోరాటాన్ని ఉపసంహరించుకకోకూడదని స్ట్రగుల్ కమిటీ జెఎసిని డిమాండ్ చేస్తుందన్నారు.

విద్యార్థి దశలో చదువు, సేవ రెండు కళ్లవ్వాలి

- ఎన్ఎస్ఎస్ శిబిరంలో డీన్ ఆచార్య సుబ్బరాయుడు

ప్రజాశక్తి-కడప అర్బన్

విద్యార్థి దశలో చదువు, సేవ రెండు కళ్లవ్వాలని వైవీయూ కామర్స్, లా అండ్ మేనేజ్‌మెంట్ డీన్ ప్రొఫెసర్ వై.సుబ్బరాయుడు ఉద్బోధించారు. మిట్టమీదపల్లి, ఇసుకపల్లి గ్రామాల్లో నిర్వహించిన ఎన్ఎస్ఎస్-4,7 యూనిట్ల పిఒలు డాక్టర్ కె.లలిత, డాక్టర్ సునీత ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరం ముగింపు సమావేశం బుధవారం విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని బిజినెస్ మేనేజ్మెంట్ విభాగంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వై.సుబ్బరాయుడు మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులను అభినందించారు. భవిష్యత్తులో కూడా సేవా కార్యక్రమాలను కొనసాగించాలని కోరారు. ఎన్ఎస్ఎస్. కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్.వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ స్వచ్ఛ భారత్, మొక్కల నాటడం, గ్రామాల్లో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం నిర్వహణ, సైబర్ సెక్యూరిటీ, బాలికల విద్య, మహిళల సైబర్ భద్రత వంటి వివిధ అవగాహన కార్యక్రమాలను నిర్వహించినందుకు పిఒలను, వాలంటీర్లను అభినందించారు. ఎంబిఎ విభాగాధిపతి డాక్టర్ పి.సరిత మాట్లాడుతూ ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రామ్ ఆఫీసర్లు, స్వచ్ఛంద సేవకుల చురుకైన భాగస్వామ్యాన్ని ప్రశంసించారు. వారం రోజుల పాటు సాగిన ఈ శిబిరం 100 మంది స్వఛేద సేవకులకు సర్టిఫికెట్‌లు, ఉత్తమ సేవకులుగా ఎంపికైన వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో బోటనీ అధ్యాపకులు డాక్టర్ రాజగోపాల్‌రెడ్డి, వాలంటీర్లు పాల్గొన్నారు.



సర్టిఫికెట్ అందజేస్తున్న డీన్ సుబ్బరాయుడు



గెలుపొందిన విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం

'శ్రీచైతన్య'లో ఘనంగా స్పోర్ట్స్ డే

ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె: శ్రీచైతన్య పాఠశాల బృందావనం (కె11) క్యాంపస్‌లో బిఎస్ రావు మెమోరియల్ స్పోర్ట్స్‌డే సెలబ్రేషన్స్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎజిఎం రమణయ్య మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు ఆటపాటలు క్రీడలు కూడా ముఖ్యమేనన్నారు. అనంతరం ఆయన క్రీడా పోటీలను ప్రారంభించారు. విద్యార్థులకు స్పోర్ట్స్‌డేలో భాగంగా త్రోబాల్, వాలీబాల్, ఖోఖో, క్రికెట్ పోటీలు నిర్వహించారు. కడప జోన్ లెవెల్ పోటీలకు ఎంపికయ్యారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు రమణయ్య చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ భాస్కరరావు, ప్రిన్సిపల్ కిరణ్మయి, సాయి కృష్ణ, ఇన్‌ఛార్జి చంద్రబాబు, సుఫీమ్, విజయ్ జోనల్ ఇన్‌ఛార్జి మారుతి, పిఇటి బృందం పాల్గొన్నారు.

19న రౌండ్ టేబుల్ సమావేశం

ప్రజాశక్తి-కడప అర్బన్: ముస్లిం సమైక్యవేదిక రాష్ట్ర కార్యవర్గ ఆత్మీయ రౌండ్ టేబుల్ సమావేశం ఈ నెల 19న మంగళగిరిలో నిర్వహిస్తున్నట్లు వేదిక రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ సలావుద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు కొనసాగు తుందని పేర్కొన్నారు. మంగళగిరిలోని ఈద్గా షాదిఖానాలో సమా వేశం ఉంటుందని పేర్కొన్నారు. రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా కమిటీ సభ్యులు, రాష్ట్ర మహిళా వింగ్ కమిటీ సభ్యులు, రాష్ట్ర లీగల్ సెల్ కమిటీ సభ్యులు, రాష్ట్ర యువజన కమిటీ సభ్యులు, నియోజకవర్గ, పట్టణ మండలాల కమిటీ సభ్యులు, అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు హాజరుకావాలని తెలిపారు.



రెడ్డి సేవా సమితికి పుస్తకాలు ఇస్తున్న సిబ్బంది

రెడ్డిసేవా సమితికి పుస్తకాలు బహూకరణ

ప్రజాశక్తి-కడప అర్బన్

సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో అదనంగా ఉన్న 300 పుస్తకాలను యోగి వేమన విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, గ్రంథాలయ సహాయకులు జి.హరిభూషణరావు కలసి కడప రెడ్డి సేవాసమితిలో ఏర్పాటు చేస్తున్న గ్రంథాలయం కోసం రెడ్డి సేవాసమితి ప్రధాన కార్యదర్శి లెక్కల కొండారెడ్డి, సభ్యులు మద్దిక సుబ్బారెడ్డి, మాచిరాజు రమణయ్యకు బుధవారం బహూకరించారు. ఈ సందర్భంగా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి మాట్లాడుతూ పరిశోధన కేంద్రం బహూకరించిన గ్రంథాల్లో డాక్టర్ దాశరథి రంగాచార్య రచించిన నాలుగు వేదాల సెట్, ఉపనిషత్ కల్పతరువు, ఉపనిషత్ రత్నాకరం, బ్రహ్మవైవర్త పురాణం, శివపురాణం, శ్రీవేంకటేశ్వర వైభవం, ఏకాదశీ మాహాత్మ్య వ్రతకథలు, ఉత్తర హరివంశం, శ్రీమద్భాగవతం, శ్రీరామకృష్ణపరమహంస, వందేళ్ళ తెలుగు కథ, భారతీ వరివస్య, కథాసాగర్, ఉత్తరాంధ్ర కథలు, ఆచారాలు : శాస్త్రీయత, గుంటూరు కథలు, సాహితీ సుషమ, దైవంతో సహజీవనం, కొడవటిగంటి కుటుంబరావు కథలు లాంటి పలు గ్రంథాలున్నాయన్నారు. కార్యక్రమంలో బ్రౌన్ గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిపుణులు అందించే జ్ఞానం విలువైంది

- వైవీయూ విసి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్

ప్రజాశక్తి-కడప అర్బన్

నిపుణులందించే జ్ఞానాన్ని ఆకలింపు చేసుకోవాలని యోగి వేమన విశ్వవిద్యాలయ విసి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ అన్నారు. యోగివేమన విశ్వవిద్యాలయం ఇంటర్నల్ క్వాలిటీ అస్సూరెన్స్ సెల్ ఆధ్వర్యంలో బి.డి.బయోసైన్స్ ఇండియా సహకారంతో ఫ్లో సైటోమెట్రీ అండ్ ఇట్స్ అప్లికేషన్స్ అనే అంశంపై ఒకరోజు సదస్సు బుధవారం నిర్వహించారు. విసి సదస్సును ప్రారంభించి నిపుణులను అభినందించారు. సెమినార్‌లో బి.డి.బయోసైన్స్ సంస్థ సీనియర్ అప్లికేషన్ స్పెషలిస్ట్ కె.కరుణ కుమార్ ఫ్లో సైటోమెట్రీ సాంకేతికత-దాని అనేక అనువర్తనాలపై ఉపన్యశించారు. పరిశోధన, శాస్త్రీయ అవగాహన పెంపొందించే దిశగా సెమినార్ కొనసాగింది. ఈ సెమినార్ ద్వారా అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు, అధ్యాపకులు ఇమ్యూనాలజీ, క్యాన్సర్ బయాలజీ, సూక్ష్మజీవుల గుర్తింపు వంటి రంగాలలో ఫ్లో సైటోమెట్రీ ఉపయోగాలపై విలువైన జ్ఞానాన్ని పొందారు. జనెటిక్స్ అండ్ జినోమిక్స్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎల్.దాక్షాయణి, ఇంటర్నల్ క్వాలిటీ అస్సూరెన్స్ సెల్ డైరెక్టర్ డాక్టర్ ఎల్.సుబ్రహ్మణ్యశర్మ కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. 225 మంది సెమినార్ లో రిజిస్టర్ చేసుకున్నారని వారు తెలిపారు. ఇందులో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మ, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ టి.శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి దేవస్థానం మెంబర్‌కు సన్మానం

ప్రజాశక్తి-కడప అర్బన్

శ్రీకాళహస్తి దేవస్థానం బోర్డు మెంబర్‌గా నియమితులైన పెనగలూరు హేమావతిని కడప జిల్లా అర్చకపురోహిత సంఘం అధ్యక్షులు పిడతల గోపాలకృష్ణ శర్మ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సత్కరించారు. హేమావతి 40 సంవత్సరాలగా తెలుగుదేశం పార్టీలో క్రియాశీలక పాత్ర పోషిస్తూ ఎంపిటిసిగా మాజీ కార్పొరేటర్‌గా సేవలందించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బ్రాహ్మణపల్లి చంద్రమౌళి శర్మ, శ్రీధర శర్మ, అజెయ్ శర్మ, సొట్టు సాంబమూర్తి, బ్రాహ్మణ సంఘం నాయకులు ప్రసాద్ రావు, మాజీ కార్పొరేటర్ సురేష్ బాబు, జగదీష్ శర్మ పాల్గొన్నారు.



సంతకాల సేకరణలో మాజీ ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి

పిపిపిని వ్యతిరేకిస్తూ వైసిపి సంతకాల సేకరణ

ప్రజాశక్తి - దువ్వూరు

ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రయివేట్ పరం చేయడాన్ని నిర సిస్తూ వైసిపి చేపట్టిన కోటి సంతకాల సేకరణలో భాగంగా బుధవారం దువ్వా రులో మాజీ ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి కార్యక్రమాన్ని చేపట్టిరు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ప్రజలకు ఎన్నో పథకాలు అందించిందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో అవేవీ లేవని విమ ర్శిం చారు. తమ ప్రభుత్వ హయాంలో మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేస్తే.. ఈ ప్రభుత్వం ప్రయివేట్ పరం చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ప్రభుత్వ సలహాదారుడు ఇరగంరెడ్డి తిరుపేల్‌రెడ్డి, ఎంపిపి కానాల జయచంద్రారెడ్డి, గోపిరెడ్డి శ్రీను, ఇరగంరెడ్డి శంకర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : పిపిపి విధానంలో నష్టాలను ప్రజలకు విశద రించాలని మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. స్థానిక రూరల్ పరిధిలోని ఆయన నివాసంలో బుధవారం పట్టణానికి చెందిన 41 వార్డుల కౌన్సిలర్లు, ఇన్‌ఛార్జిలతో ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాచమల్లు మాట్లాడుతూ మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణను వ్యతిరేకస్తూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకొని విజయ వంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఖాజా మొహిద్దీన్, వైసిపి పట్టణ అధ్యక్షులు భూమిరెడ్డి వంశీధర్ రెడ్డి, కౌన్సిలర్లు, కో- ఆప్షన్ సభ్యులు, వార్డు ఇన్‌ఛార్జిలు పాల్గొన్నారు.

కలిసికట్టుగా పనిచేయాలి : ఎమ్మెల్సీ పిఆర్

ప్రజాశక్తి - జమ్మలమడుగు

గ్రామ, పట్టణ స్థాయిలోని ప్రధాన నాయకులు, కార్యకర్తలు కింది స్థాయి కార్యకర్తలను కలుపుకొని కలిసికట్టుగా పని చేయాలని వైసిపి ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి కోరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన జమ్మలమడుగు రూరల్ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా పిఆర్ మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో గ్రామ(పంచాయతీ)/వార్డు (పట్టణ) పార్టీ, అనుబంధ విభాగాల కమిటీల విధివిధానాలు వివ రించారు. కార్యకర్తలకు పార్టీ కమిటీలు, అనుబంధ విభాగాల కమిటీల గురించి వివరించారు. కార్యక్రమంలో గిరిధర్‌రెడ్డి, మల్కిరెడ్డి, హనుమంతురెడ్డి, సట్టకారు సుబ్రమణ్యం, ప్రతాప్‌రెడ్డి, గూడెంచెరువు నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న నాయీ బ్రాహ్మణులు

కుల వృత్తులను సంరక్షించాలని ర్యాలీ

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

కుల వృత్తుల్లోకి ఇతర కులాల వారు రావడాన్ని నిరసిస్తూ, వాటిని సంరక్షించాలని కోరుతూ మైదుకూరులో బుధవారం నాయీ బ్రాహ్మణలు ర్యాలీ నిర్వహించారు. మైదుకూరు మున్సిపాలిటీ, మండలంలోని నాయీ బ్రాహ్మణులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య నాయకులు మాట్లాడుతూ మైదుకూరు పట్టణంలో కొందరు ఇతర కులస్తులు హెయిర్ కటింగ్ సెలూన్ షాపులు ప్రారంభించి, అందులో యూపీ వారితో సేవలు చేయించుకునేలా షాపులు పెట్టారన్నారు. ఏళ్ల తరబడి కులవృత్తి తాము చేసుకుంటూ ఒకరి కడుపులు కొట్టకుండా న్యాయంగా జీవిస్తున్నామన్నారు. నేడు ఇతర కులస్తులు వేరే రాష్ట్రం నుంచి మనుషులను తెప్పించి వారితో పనులు చేయిస్తూ మా కడుపు కొట్టడం ఎంతవరకు సమంజసమని నాయి బ్రాహ్మణులు ఆవేదన వ్యక్తం చేశారు. అన్య మతస్తులు హెయిర్ సెలూన్లను ఏర్పాటు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. అనంతరం అర్బన్ సిఐ రమణారెడ్డికి ఫిర్యాదు చేశారు.

బెల్టు షాపులు నిర్వహిస్తే చర్యలు

ప్రజాశక్తి - ముద్దనూరు

బెల్టు షాపులు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఇన్‌స్పెక్టర్ విన్నీలత హెచ్చరించారు. స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో బుధవారం విన్నీలత ఆధ్వ ర్యంలో 'ఎపి ఎక్సైజ్ సురక్ష' యాప్‌పై ఆ శాఖ పరిధిలోని కొండాపురం, సింహాద్రిపురం, ముద్దనూరు, తొండూరు మండలాల్లోని మద్యం దుకాణ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కల్తీ మద్యం గుర్తించేందుకు ప్రభుత్వం కొత్తగా ఎపి ఎక్సైజ్ సురక్ష యాప్‌ను ఆవిష్కరించిందన్నారు. మద్యం స్వచ్ఛమైందా, కల్తీనా తనిఖీ చేసేందుకు ఈ యాప్ ఉపయోగపడుతుందన్నారు. ఈ యాప్ ప్రతి ఒక సామాన్యుడు సెల్‌ఫోన్లో డౌన్లోడ్ చేసుకోవచ్చన్నారు. మద్యం విక్రయించేటప్పుడు ప్రతి ఒక్క బాటిల్ తప్పని సరిగా స్కాన్ చేసి అమ్మకాలు జరపాలని సూచించారు. బెల్టుషాపులు, నాటు సారా నిర్వహించినా, ఇతర రాష్ట్రాల నుంచి మద్యం తరలించినా ఎక్సైజ్ శాఖ పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఫాగింగ్ చేయడంలో అధికారుల నిర్లక్ష్యం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్)

గోపవరం పంచాయతీ పరిధిలో దోమలు బెడద నివారణకు ఫాగిం గ్ చేయాలని డివైఎఫ్ఐ నాయకులు కోరారు. ఆ మేరకు బుధవారం వారు ఎంపిడిఒ కార్యాలయ ఎఒ బాలన్నకు వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోపవరం పంచాయతీ పరిధిలో దోమల వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. సమస్యను గోపవరం పంచాయతీ కార్యదర్శికి పలుమార్లు విన్నవించినా ఫలితంలేదన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు మేరీ కుమార్, కార్యదర్శి విశ్వనాథ్ పాల్గొన్నారు.

అటు మోదం..ఇటు ఖేదం

కిలో సెంచరీ చేరిన పచ్చిమిర్చి ధర - రైతుల్లో ఆనందం.. సామాన్యునికి భారం



ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పచ్చిమిర్చి ధర మంటెక్కిస్తున్నాయి. కొనేందుకు వెళితే విని యోగదారులకు మంట పుడుతోంది. ఇది రైతుల్లో ఆనందాన్ని కలిగిస్తున్నా. సామాన్యుడికి భారంగా మారింది. కిలో రూ.50 ఉన్న పచ్చిమిర్చి ప్రస్తుతం రూ.100 చేరింది. విపరీతంగా ధర పెరగడంతో వినియోగదారులు ఆచి తూచి కొనుగోలు చేస్తున్నారు. పచ్చిమిర్చి ధర కొన్నాళ్లుగా పెరుగుతూ, తగ్గుతూ వస్తోంది. తోపుడు బండ్ల వ్యాపారులు కిలో పచ్చిమిర్చి ధర రూ.120 అమ్ముతున్నారు. ఇదే పరిస్థితి కొంతకాలంపాటు కొనసాగే అవ కాశం ఉందని వ్యాపారులు పేర్కొంటున్నారు. ధరలు తక్కువగా ఉండడం, చిన్నపాటి వర్షానికే మిర్చి పంటకు పూత రాలి దిగుబడి తగ్గడంతో ధరలు పెరగడానికి కారణమని వ్యాపారాలు పేర్కొంటున్నారు. పులివెందుల నియోజకవర్గంలో అత్యధికంగా మండలంలోని నల్లగుండువారి పల్లి, కొత్తపల్లి, నల్లపురెడ్డిపల్లి, లింగాల మండలంలో అంబకపల్లి, మురారి చింతల గ్రామాల్లో అధికంగా పచ్చిమిర్చి సాగు చేస్తారు. ఎక్కువ ధర ఉన్నప్పటికీ రైతుల దగ్గర నుంచి కిలో రూ.60 నుండి రూ.70 తో వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. అన్ని రకాల వంటకాల్లో మిర్చి అవసరం కావడంతో తప్పనిసరి పరిస్థితుల్లో కొనుగోలు చేస్తున్నారు.

సాగు విస్తీర్ణం తగ్గడంతోనే ధరలు పెరిగాయి

పంటసాగు విస్తీర్ణం తగ్గడం వల్ల స్థానికంగా పచ్చి మిర్చి ధరలు అమాంతం పెరగడానికి ప్రధాన కారణం. చుట్టుపక్కల గ్రామాల నుంచి పచ్చిమిర్చి మార్కెట్‌కు వచ్చేది. ప్రస్తుతం ధర తగ్గే పరిస్థితి లేదు.

- దశరథ, కూరగాయల వ్యాపారి, పులివెందుల

గత నెలలో రెండెకరాల పొలాన్ని దున్నేశాం

ధరలులేక, కూలీలకు ఖర్చు పెరిగి గిట్టుబాటు కాకపోవడంతో గత నెలలో సాగు చేసిన రెండు ఎకరాల పచ్చిమిర్చి పొలాన్ని దున్నేశాం. రూ.2లక్షల వరకు నష్టం. ప్రస్తుతం ధరలు పెరిగాయి. పంటలేదు.

-హరి, రైతు నల్లగొండువారి పల్లి, పులివెందుల

పంట సాగుకు అధిక ఖర్చు

మిరప సాగు చేయడానికి అధిక ఖర్చవుతుంది. సాగు ప్రారంభం నుండి మందులు వాడాల్సి ఉంటుంది. తెగుళు రావడం, ఎండకు పూత రాలడంతో వాటిని అరికట్టేందుకు మందులు పిచికారి చేయాల్సి వస్తుంది. పంట కోత సమయంలో కూలీలకు ఎక్కువ అవసరం ఉంటుంది. వారి ఖర్చు కూడా అధికంగా ఉంటుంది. ఈ కారణాలతో రైతులు పచ్చిమిర్చి సాగుకు పెద్దగా ఆసక్తి చూపరు.

- జనార్దన్‌రెడ్డి, రైతు, పులివెందుల

వాడకం తగ్గించుకోవాల్సి వస్తుంది

వ్యవసాయ పనులు లేకపోవడంతో కుటుంబ పోషణ భారంగా ఉంది. పచ్చిమిర్చి ధర ఎక్కువగా ఉండడం వల్ల ఎండు మిర్చిని వాడాల్సి వస్తోంది. అన్ని రకాల కూరల్లో పచ్చిమిర్చి అవసరమైనా.. ఆర్థిక పరిస్థితులు సరిగా లకపోవడం వల్ల వాడకం తగ్గించాం.

-సావిత్రి, వ్యవసాయ కూలీ, పులివెందుల

పేద విద్యార్థుల జీవితాల్లో విద్యా వెలుగులు నింపాలి



కొత్త ఉపాధ్యాయులకు యుటిఎఫ్ డైరీని అందజేస్తున్న నక్క వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రభుత్వ బడుల్లో చదువుతున్న పేద విద్యార్థుల జీవితాల్లో ఉపా ధ్యాయులు విద్యా వెలుగులు నింపాలని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఇటీవల మెగా డీఎస్సీలో ఎంపికై పాఠ శాలల్లో విధులు చేపట్టిన నూతన ఉపాధ్యాయులకు బుధవారం అభి నందనలు తెలియజేసే కార్యక్రమంలో భాగంగా వేంపల్లె, వేముల, చక్రాయపేట మండ లాల పరిధిలోని పలు పాఠశాలలను యుటిఎఫ్ నాయ కులు సంద ర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో నమ్మకంతో, విశ్వాసంతో ప్రభుత్వ పాఠశాలకు విద్యనభ్యసించడానికి వచ్చే పేద విద్యా ర్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాల న్నారు. ప్రత్యేకించి నూతన ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల ప్రేమా భిమా నాలు కనబరచాలన్నారు. ప్రభుత్వ బడిపై విశ్వాసాన్ని కలిగించాలని సూచిం చారు. వృత్తి పట్ల అంకిత భావం కలిగి ఉండాలన్నారు. ఉపా ధ్యాయుల కోసం నిరంతరం రాజీలేని సమరశీల పోరాటాలు నిర్వహించే యుటిఎఫ్‌లో నూతన ఉపాధ్యాయులు సభ్యులుగా చేరి సంఘాన్ని బలోపేతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కె.సురేష్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను వివరించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్‌బాబు, జిల్లా కార్యదర్శులు చెరుకూరి శ్రీనివాసులు, సివి రమణ, వేంపల్లె మండల నాయకులు టి.వెంకటరమణ, సయ్యద్ సనావుల్లా, రాజశేఖర్, రవీంద్ర, హెచ్‌ఎంలు నాగాంజనేయులు, మురళి, ఎంఈఓ-2 రవికిరణ్ ఉపాధ్యా యులు ఆవుల వెంకట్, రెడ్డి సాయి, రాధా పాల్గొన్నారు.

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు) : విద్యార్థుల అభివృద్ధికి కృషి చేయాలని పలువురు ఉపాధ్యాయులు కొత్తగా చేరిన ఉపాధ్యాయులకు సూచించారు. మైదుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొత్తగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులను బుధవారం సన్మానించారు. 2025 డీఎస్సీలో బి.స్వర్ణలక్ష్మీ (తెలుగు), ఎస్.రవీంద్రారెడ్డి (గణితం)ని గోశెట్టి రామమోహన్ ఆధ్వర్యంలో సర్వీస్ ఫైల్స్, సర్వీస్ రిజిస్టర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ప్రధా నోపాధ్యాయుడు ఇలియాస్ అహమ్మద్ మాట్లాడుతూ కొత్త ఉపాధ్యాయులు తమ వృత్తిలో నిక్కచ్చిగా ఉండాలన్నారు. విద్యార్థులు, పాఠశాల పురోభివృద్ధికి తోడ్పడాలన్నారు. విద్యార్థులు నూతన ఉపాధ్యా యులను ఆదర్శంగా తీసుకొని కష్టపడి మంచి ఫలితాలు సాధించి ఉన్నత స్థితికి చేరాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆనందరావు, సురేంద్ర నాయక్, స్వర్ణలత, మాధవీలత, రాజేంద్ర, తవ్వా ఓబుల్‌రెడ్డి, వెంకటేష్, ఎ.శ్రీనివాసులు, పద్మజ, నీరజ, రమాదేవి, లక్ష్మీ నారాయణమ్మ, సునీత, సుబ్బమ్మ పాల్గొన్నారు.

అబ్దుల్ కలాం అడుగుజాడల్లో నడుద్దాం

- వైవీయూ విసి ఆచార్య రాజశేఖర్

ప్రజాశక్తి-కడప అర్బన్

భారతదేశం అత్యంత ఆరాధించబడే మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం అడుగుజాడల్లో నడవాలని విశ్వవిద్యాలయ విసి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ అన్నారు. బుధవారం అబ్దుల్ కలాం జయంతిని పుర స్కరించుకుని వైవీయూలోని అబ్దుల్ కలాం భవనంలో ఆయన చిత్రపటానికి విసి ఆచార్య రాజశేఖర్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్ర మంలో వైవీయూ ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మ, ప్రిన్సిపల్ ఆచార్య టి.శ్రీనివాస్, డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ డాక్టర్ టి.లక్ష్మీప్రసాద్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ కెఎస్‌వి కష్ణారావు, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రెడ్డయ్య పాల్గొన్నారు. **విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ :** అబ్దుల్ కలాం జయం తి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఆడిటర్ పటాన్ తౌహీద్ ఖాన్ నివాళులర్పించారు. అనంతరం నగరంలో ఉన్న బాసట చిల్డ్రన్స్ హోమ్‌లో విద్యార్థులకు పుస్తకాలు, క్యాలిగ్రఫీ పుస్తకాలు, స్టేషనరీ అందజేశారు. కార్యక్రమంలో అబ్దుల్ కలామ్ సేవా సమితి సభ్యులు ఫారుక్, ఆర్డిఎస్ ఫౌండర్ జోసెఫ్, ఎస్ఆర్పి ఫౌండేషన్ అధ్యక్షుడు ప్రదీప్, శరన్ కుమార్ పాల్గొన్నారు. **కలసపాడు:** మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల కరణంవారిపల్లెలో అబ్దుల్ కలాం జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలతో అలంకరించి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గానుగపెంట రమణారెడ్డి, టీచర్ బాలేజోజి పాల్గొన్నారు.



విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేస్తున్న తౌహీద్‌ఖాన్

వేంపల్లె : భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న ఎపిజె అబ్దుల్ కలాం జీవితం ఆదర్శం, అనుసరణీయం, స్ఫూర్తిదాయకమని పిసిసి అధికార ప్రతినిధి ఎన్.తులసిరెడ్డి పేర్కొన్నారు. అబ్దుల్ కలాం 94వ జయంతి సందర్భంగా బుధవారం ఆయన చిత్రపటానికి తులసిరెడ్డి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ ప్రపంచ చరిత్రలోనే ఒక విలక్షణమైన, విశిష్టమైన నాయకుడు అబ్దుల్ కలాం అన్నారు. స్వయంకృషి, స్వీయ ప్రతిభతో ఒక సామాన్యుడు మాన్యుడు, అసామాన్యుడు కాగలరని నిరూపించారన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా : ఎంపీ

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటానని, ఎవరూ ఆధైర్య పడ కుండా ఉండాలని కడప పార్లమెంటు సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డి తెలి పారు. స్థానిక వైసిపి కార్యాలయంలో బుధవారం ఎంపీ ప్రజాదర్బార్ నిర్వ హించారు. ఈ సందర్భంగా వైసిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున వారి సమస్యలను ఎంపీ దృష్టికి తెచ్చారు. ఆయన స్పందిస్తూ సం బంధిత అధికారులకు ఫోన్ చేసి సమస్యను పరిష్కరించాలని కోరారు. అందుబాటులో ఉండి మీ సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

కూటమి ప్రభుత్వంలో ఉల్లి రైతులకు అన్యాయం

- మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్)

కూటమి ప్రభుత్వంలో ఉల్లి రైతుకు అన్యాయమని వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. స్థానికంగా బుధవారం ఆయన తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేఖరుల మాట్లాడుతూ ఉల్లి రైతులు పంట దిగుబడిని అమ్ముకోలేక ప్రక్క రాష్ట్రాలకు వెళ్లినా సరైన ధర లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ తరుణంలో ప్రభుత్వం మొదట ఉల్లి అధికంగా పండించే కర్నూలు జిల్లా రైతులకు క్వింటాకు రూ.1200 అందిస్తామని, మళ్లీ ప్రభుత్వానికి నష్టమని పేర్కొంటూ రెండున్నర ఎకరాకు రూ.50వేలు ఇస్తామని ప్రకటించారని తెలిపారు. కడప జిల్లా ఉల్లి రైతులకు న్యాయం చేయాలని ఇదివరకే ఎంపీ అవినాష్‌రెడ్డి, మైదుకూరు మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి కలెక్టర్‌కు వినతిపత్రం అందించారని గుర్తు చేశారు. ఉల్లి రైతులకు ప్రభుత్వం హెక్టారుకు రూ.లక్ష సాయం చేయాలని, ఉల్లి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించని తరుణంలో త్వరలో కడప కలెక్టరేట్ ఎదుట 48 గంటల నిరాహారదీక్ష, అప్పటికీ స్పందించని తరుణంలో భిక్షాటన చేసి మైదుకూరు మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి ద్వారా జిల్లా రైతులకు తామే సహాయం చేస్తామని రాచమల్లు వివరించారు.

భూసార పరీక్షలు చేసి ఎరువులు వాడాలి

ప్రజాశక్తి - వేంపల్లె

భూసార పరీక్షా ఫలితాల ఆధారంగా ఎరువులు వాడాలని డిఆర్‌సి ఇన్‌ఛార్జి డిడి మర్రిపాటి నాగరాజు సూచించారు. మండలంలోని అలిరెడ్డిపల్లె, ఇడుపులపాయ గ్రామాల్లో భూసార పరిరక్షణ పథకం, భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువులు వాడే విధానంపై రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తేటప్పుడు తప్పకుండా విత్తనశుద్ధి చేయాలన్నారు. ఎడిఎ ఆశోక్‌రెడ్డి, ఎఒ శివశంకరరెడ్డి మాట్లాడుతూ భూసార పరీక్షా ఫలితాల ఆధారంగా ఎరువులు వాడే విధానంలో మెలకువలపై అవ గాహన ఉం డాలన్నారు. పాడి పంటల మాస పత్రికను రైతులకు అందించారు. కార్య క్రమంలో గ్రామ వ్యవసాయ సహా యకులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బం ది, రైతులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న జెడి చంద్ర నాయక్

రెండ్రోజుల్లో శనగ విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి - వేముల

రెండ్రోజుల్లో శనగ విత్తనాలు పంపిణీ చేస్తామని జిల్లా వ్యవసాయశాఖాధికారి చంద్ర నాయక్ తెలిపారు. వేముల మండల కేంద్రంలోని చాగలేరు,పెద్ద జూటూరు రైతు సేవా కేంద్రాలను బుధవారం ఆయన ఆకస్మి కంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రైతులు, సిబ్బందితో మాట్లా డుతూ రబీ సీజన్, ప్రస్తుత పంటల పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో పంట నమోదు, ల్యాండ్ పార్సెల్స్ త్వరగా పూర్తి చేయాలని రైతు సేవా కేంద్రం సిబ్బందిని ఆదేశించారు. ఈనెల 20లోపు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎఒ జిపి ఓబులేసు, మాజీ సర్పంచ్ బొగ్గుల భాస్కర్‌రెడ్డి, క్షేత్రస్థాయి సిబ్బంది ఎఒ సురేష్, నాయక్, ప్రసన్న, రైతులు పాల్గొన్నారు.

తాగునీటి పైపులైన్ ఏర్పాటుకు సర్వే

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె ప్రజలకు తాగునీరు అందించేందుకు కొత్త పైపులైన్ వేసేందుకు ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు సర్వే చేశారు. బుధవారం పంచాయతీ ఇఒ నాగభూషణం రెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ సాలన్, మెగా కంపెనీ ప్రతినిధులతో కలిసి టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి సర్వే చేపట్టారు. దీనిపై రామమునిరెడ్డి అధికారులతో చర్చించారు. ప్రజలకు అనుకూలంగా, భవిష్యత్‌లో ఇబ్బందులు తలెత్తకుండా ఉండేలా ప్రణాళికలు వేయాలన్నారు. మెగా కంపెనీ ద్వారా ప్రతి ఇంటికి కుళాయి కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగభూషణంరెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ దివ్వే, పంచాయతీ ఫిట్టర్ శివయ్య, మెగా కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

పిఎం పర్యటనకు 66 ఆర్‌టిసి బస్సులు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గురువారం నంద్యాల, కర్నూల్ జిల్లాల పర్యటన నేపథ్యంలో పులివెందుల ఆర్‌టిసి డిపో నుండి 66 బస్సులను ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ ప్రేమకుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

రాయితీ బుడ్డశనగలు సకాలంలో అందించాలి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

రాయితీ బుడ్డ శనగ విత్తనాలను రైతులకు సకాలంలో అందిం చాలని టిడిపి పులివెందుల మాజీ పట్టణ అధ్యక్షుడు మద్దూరు వెంకటరామిరెడ్డి మంగళగిరిలో వ్యవసాయ కమిషనర్ కార్యాలయంలో ఆశాఖ కమిషనర్ డాక్టర్ మనాజిర్ జీలానీ సమూన్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పులివెందుల నియోజకవర్గంలోని 7 మండలాల రైతులకు శనగ (బేన్‌గ్రామ్) విత్తనాల సరఫరా, రైతుల సమస్యలను విన్నవించారు. రైతు లకు శనగ విత్తనాలను సకాలంలో, నాణ్యతతో కూడిన వాటిని సరఫరా చేయా లని కోరారు. ఇందుకు కమిషనర్ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో జగన్మోహన్ రెడ్డి, తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చేతుల శుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి - ఖాజీపేట



చేతుల శుభ్రత వస్తువులను అందజేస్తున్న ఎంఇఒలు

విద్యార్థులు చే తులు శుభ్రతను తప్పక పాటిం చాలని ఎంఇఒలు నాగ స్వర్ణలత, సత్యనారాయణ సూచించారు. స్థానిక కస్తూర్బా పాఠశాలలో బుధవారం ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు చేతుల శుభ్రత గురించి వివరించారు. ప్రతి ఒక్కరూ భోజనానికి ముందు, మలవిసర్జన తర్వాత చేతులను తప్పక శు భ్రం చేసుకోవాలని సూచిం చారు. చేతుల శుభ్రత ద్వారా ఎలాంటి అనారోగ్య సమస్యలు ఎదురవ్వవన్నారు. ఈ సందర్భంగా పరిశుభ్రత అంశాల మీద వివిధ పోటీలు నిర్వహించి ప్రతిభావంతులైన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ప్రిన్సిపల్ భార్గవి, సార్డ్స్ ఎన్జీవో రీజనల్ ప్రోగ్రాం ఆఫీసర్ విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

వేంపల్లె : చేతులు శుభ్రంగా సబ్బుతో కడుక్కుంటే వ్యాధులు రావని డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ షఫీ వున్నిసా బేగం పేర్కొన్నారు. తాళ్ళపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం వేంపల్లె జిల్లా పరిషత్ బాలికల పాఠ శాలలో గ్లోబల్ హ్యాండ్ వాషింగ్ డే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నాగ ఆంజనేయులు, పిడి జయప్రద, ప్రభావతి, ఆశాలు పాల్గొన్నారు.

నేడు గండిక్షేత్రంలో బహిరంగ వేలం పాట

ప్రజాశక్తి - చక్రాయపేట

రాయలసీమలో పేరు ప్రఖ్యాతి చెందిన గండి క్షేత్రంలో గురువారం వివిధ హక్కులకు సంబంధించి బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు ఆలయ పాలకమండలి చైర్మన్ కావలి కృష్ణతేజ, ఎసి వెంకటసుబ్బయ్య తెలిపారు. దేవస్థానం ఆవరణలో టెంకాయలు విక్రయించుకొనుటకు హక్కు, వివాహ, ఇతర కార్యక్రమంలో పందిర్లు, ఎలక్ట్రికల్ డెకరేషన్లు, పూల డెకరేషన్లు, సప్లయర్స్ సామాన్లు ఏర్పాటు చేసుకొను హక్కు, స్వామివారికి పూలమాలలు సప్లయ్ చేయు హక్కు, అన్నదానానికి అరటి ఆకులు రవాణా చేయు హక్కు, మామిడి, అరటి తోరణాలు సరఫరా చేయు హక్కు, ఖాళీ నెయ్యి డబ్బాలు విక్రయించుటకు ఇతర వివిధ హక్కులకు సంబంధించి గండిక్షేత్రం కార్యాలయంలో వేలంపాట నిర్వహించనున్నట్లు తెలిపారు. సమాచారం నిమిత్తం గండిక్షేత్రంలోని కార్యాలయంలో సంప్రదించాలని వారు సూచించారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఖాజా మొహిదీన్

సింహాద్రిపురం : సీజనల్ వ్యాధులు పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఖాజా మొహిదీన్ సూచించారు. సింహాద్రిపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కుమ్మరాంపల్లెలో బుధవారం వైద్యశిబిరం నిర్వహించారు. అక్కడ జరుగుతున్న లార్వా సర్వే, ఫీవర్ సర్వే తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు పడుతున్నందున జలుబు, దగ్గు, వైరల్ ఫీవర్స్ వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ సిద్దయ్య, అధికారి ఆరోగ్య విస్తరణ అధికారి సుకుమార్, సీనియర్ అసిస్టెంట్ నరేష్, సూపర్‌వైజర్ విజయలక్ష్మి, సిహెచ్ఒ యమున పాల్గొన్నారు.

మురుగు తొలగింపు.. సింహాద్రిపురం సమీపంలోని కుమ్మరంపల్లె కాలనీలో మురుగు కాలువలను పారిశుధ్య కార్మికులు శుభ్రం చేశారు. ఇన్‌ఛార్జి ఈఓ పిఆర్‌డి వెంకటరాముడు ఆధ్వర్యంలో కార్మికులు మురుగు తొలగింపుతో పాటు బ్లీచింగ్ చల్లారు. దోమల నివారణకు మురుగు కాలువల్లో ఆయిల్ వేశారు.

మోడీ రాయలసీమ పర్యటన శోచనీయం

- ఎపి చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వీరనాల శివనారాయణ

ప్రజాశక్తి - జమ్మలమడుగు

నరేంద్ర మోడీ ఎన్నికల వాగ్దానాలలో ఒక్కటి నిరవేర్చకుండా రాయలసీమ పర్యటన దుర్మార్గమని ఎపి చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వీరనాల శివనారాయణ తెలిపారు. స్థానిక ఎన్జీవో కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇచ్చిన హామీల్లో ఏమీ నెరవేర్చాలని మోడీ కర్నూలు పర్యటన ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు. రాయలసీమకు ప్యాకేజీ ఇచ్చారా, కడప ఉక్కు కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందా, ఆంధ్రప్రదేశ్‌కు ప్యాకేజీ ఇచ్చారా, విశాఖ ఉక్కు ప్రయివేటీకరణను ఆపారా అని ప్రశ్నించారు. ప్రభుత్వ కూటమి నేతలు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ రాష్ట్రాభివృద్ధికి తోడ్పడే ఈ హామీలపైన మోడీని అడగాలని డిమాండ్ చేశారు. చేనేతలు పనులు లేక ముడి సరుకుల ధరలు పెరిగి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. చేనేత సమస్యలు ఆలకించాలని కోరారు. సమావేశంలో చేనేత కార్మిక సంఘం నాయకులు నారాయణ, డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు ఎల్లయ్య పాల్గొన్నారు.